

వారం క్రితం వేసిన సిమెంట్ రోడ్డు

## రోడ్డు వేశారు.. క్యూరింగ్ మరిచారు

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నర్సింగాపూర్ గ్రామంలో వారం క్రితం ఈజీఎస్ నిధుల ద్వారా సీసీ రోడ్డు నిర్మించారు. నర్సింగాపూర్ నుంచి మండలంలోని రాజేశ్వర్ రావ్ పల్లె వరకు దారి వేశారు. కానీ, కాంట్రాక్టర్ వాటర్ క్యూరింగ్ చేయడం మరిచారు. పనులు పూర్తయిన తర్వాత సదరు కాంట్రాక్టర్ అటువైపు కన్నెత్తి చూసిన దాఖాలాలేలవు. రోడ్డు వేశామా.. అంటే వేశాం.. అనే చందంగా గాలికొదిలేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే సీసీ రోడ్డుకు నీరుపట్టడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. క్యూరింగ్ చేస్తే పది కాలాలు పదిలంగా ఉండాల్సిన రోడ్డు, కొద్ది రోజుల్లోనే పగుళ్లు ఏర్పడి ప్రజా ధనం వృథా అవుతుందని అంటున్నారు. గ్రామాల్లో వేసే రోడ్లకు సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతోనే సదరు ఇలా నిర్లక్ష్యంగా వదిలేశారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, నాయకులు చొరవ తీసుకొని రోడ్డును ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - హాజీపూర్, జూన్ 1



రామ్‌నగర్‌లో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

## రోడ్డుపై మురుగు..

బెల్లంపల్లి పట్టణంలోని రామ్‌నగర్ ప్రధాన రోడ్డుపై మురుగు నీరు పారుతున్నది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై నీరు ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని స్థానికులు వాపోయారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. - బెల్లంపల్లి, జూన్ 1

# నిధులు మళ్లించి.. నిర్మాణాలు నిలిపేసి

## ఆగిపోయిన కేసీఆర్ మల్టీ పర్పస్ ఫంక్షన్ హాళ్ల నిర్మాణం

- సామాన్యుడి వేడుకల హాలు నిర్మాణంపై ప్రభుత్వ అలసత్వం
- మాజీ విప్ బాల్క సుమన్ చొరవతో నిధులు
- ఇతర పనులకు మళ్లించాలని స్థానిక ఎమ్మెల్యే ఆదేశం
- ప్రభుత్వం, ఎమ్మెల్యే తీరుపై ప్రజల్లో ఆగ్రహం

కేసీఆర్ ప్రభుత్వం.. మందమర్రి మున్సిపాలిటీలో ఆధునిక హంగులతో నిర్మించతలపెట్టిన కేసీఆర్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్ల నిర్మాణం.. అర్ధాంతరంగా ఆగిపోయింది. నిరుపేద, మధ్య తరగతి ప్రజలు గర్వించేస్థాయిలో వేడుకలు నిర్వహించుకునేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం.. కాంగ్రెస్ ప్రభుత్వ అలసత్వంతో నీరుగారింది. సగర్వంగా కార్యక్రమాలు జరుపుకోవచ్చనుకున్న ప్రజలకు.. సర్కారు నిర్వాకం, స్థానిక ఎమ్మెల్యే ఆదేశం శాపంగా మారింది. కాగా, ప్రభుత్వంతో పాటు, ఆయన తీరుపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. - మందమర్రి, జూన్ 1

మందమర్రి మున్సిపాలిటీలో కాలనీలు ఇరుకుగా ఉంటాయి. దీంతో ఎవరి ఇంట్లోనైనా వేడుకలు నిర్వహించుకోవాల్సి వస్తే వీధుల్లో రోడ్లను బ్లాక్‌చేసి అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి. సరైన వసతులు లేక ప్రజల కష్టాలను గుర్తించిన మాజీ విప్, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మున్సిపాలిటీలో వివిధ వార్డుల్లో 8 కేసీఆర్ మల్టీ పర్పస్ ఫంక్షన్ హాళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఒక్కో హాలుకు రూ.కోటి అంచనా వ్యయంతో పనులు చేపట్టారు. తెలంగాణ అర్బన్ ఫైనాన్షియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ) కింద నిధులు మంజూరు చేయించారు. దీంతో పలు వార్డుల్లో పనులు ప్రారంభమయ్యాయి. మున్సిపాలిటీ పరిధిలోని ప్రాణహిత కాలనీలో చేపట్టిన హాలు నిర్మాణం పూర్తికాగా, 2023, అక్టోబర్ 1వ తేదీన ఆనాటి మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారాకరామారావు ప్రారంభించారు. 12వ వార్డు పోస్టాఫీస్ సమీపంలో పనులను ప్రారంభ దశలో ఉండగా పలు వార్డుల్లో స్థల వివాదం కారణంగా నిర్మాణంలో ఆలస్యమైంది. ఇంతలోనే ఎన్నికలు రావడం.., కోడ్ అమలులో ఉండడంతో పూర్తిగా నిలిపివేశారు. అనంతరం ప్రభుత్వం మారడంతో 12వ వార్డులో




మందమర్రి ప్రాణహిత కాలనీలో నిర్మించిన ఫంక్షన్ హాల్

చేపట్టిన ఫంక్షన్ హాల్ నిర్మాణం నిలిపి వేసి, సంబంధిత కాంట్రాక్టర్ సామగ్రిని తరలించుకుపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా పేదోడి ఫంక్షన్ హాళ్ల నిర్మాణం పనులను పట్టించుకోవడం లేదు. అయితే ఫంక్షన్ హాళ్లకు కేటాయించిన టీయూఎఫ్ఐడీసీ నిధులను కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు మళ్లించాలని సంబంధిత మున్సిపల్ అధికారులకు చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. కాలనీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయించాల్సింది పోయి, ఇతర అభివృద్ధి పనులను నిలిపి వేయడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రాణహిత కాలనీలో ఫంక్షన్ హాల్ నిర్మాణం పూర్తియినా వినియోగంలోకి తీసుకురాకపోవడంపై ఆ కాలనీ వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పెద్ద ఫంక్షన్‌ల జరుపుకునేందుకు ఇండ్లు అనుకూలంగా లేక వ్యయప్రయాసలకోర్చి దూర ప్రాంతంలోని ప్రైవేటు ఫంక్షన్ హాళ్లను ఆశ్రయించాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. ఒక్కో సమయంలో ఫంక్షన్ హాళ్లు దొరకక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని అంటున్నారు. తమ కాలనీల్లో ఫంక్షన్ హాళ్ల నిర్మాణం జరిగితే కష్టాలు తీరుతాయని ఆశించామని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వాకంతో తమ ఆశలు అడియాశలయ్యాయని వాపోతున్నారు. ఈ విషయంపై సంబంధిత మున్సిపల్ డీఈ సుమతిని వివరణ కోరగా... ప్రాణహిత కాలనీలో ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించినప్పటికీ మరుగుదొడ్లకు సంబంధించిన సెప్టిక్ ట్యాంక్ లేకపోవడంతో వినియోగంలోకి తీసుకురాలేకపోతున్నామని తెలిపారు. కొద్ది రోజులలో పూర్తిస్థాయి పనులు చేపడతామని పేర్కొన్నారు. టీయూఎఫ్ఐడీసీ నిధులతో మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో ప్రజలకు అత్యవసరమైన చోట రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతో పాటు, తాగునీటి పనులు చేపడుతున్నట్లు వివరించారు.



మందమర్రి మున్సిపాలిటీ 12వ వార్డులో సామగ్రిని తరలిస్తున్న సిబ్బంది

## గుడుంబా స్థావరాలపై దాడులు



బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎస్ఐ విక్రమ్

దహెగాం, జూన్ 1 : దహెగాం మండలం మర్రిపల్లి గ్రామ సమీపంలోని పంట పొలాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. గుడుంబా తయారు చేస్తున్నారనే సమాచారంతో ఆ ప్రాంతంలో దాడులు చేయగా, ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ చేసిన 100 లీటర్ల బెల్లం పానకం పట్టుబడిందని పేర్కొన్నారు. దానిని ధ్వంసం చేసినట్లు తెలిపారు. పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 1 : పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు 3 నుంచి జరుగనుండగా, ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా విద్యాధికారి యాదయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో 3 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, మొత్తం 680 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో విద్యార్థులు సకాలంలో కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

## ఇసుక తెచ్చి.. గుంత పూడ్చి



గుంతలో ఇసుక వేసి పూడ్చుతున్న ఆనంద్ రావు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూన్ 1 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై గుంత ఏర్పడింది. చాలా రోజులే అవుతున్నా అధికారులెవరూ పట్టించుకోలేదు. దీంతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాగా, సీనియర్ అథ్లెటిక్, ఆటో డ్రైవర్ వైరాగడే ఆనంద్ రావు తన ఆటోలో రాళ్లు, ఇసుక తెచ్చి గుంతను పుడ్చాడు. దీంతో పలువురు ఆయనను అభినందించారు.

## ప్రపంచ సైక్లింగ్ దినోత్సవం

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 1 : ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడా పాఠశాల ఆధ్వర్యంలో ఆదివారం సైక్లింగ్ నిర్వహించారు. హెచ్ఎం జంగు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సైక్లింగ్ ఆర్ ఎస్ఐ రాజేశ్, అత్యాపత్యా క్రీడల జిల్లా అధ్యక్షుడు కట్కర్ భీమ్ రావ్, ఖేలో ఇండియా కోచ్ కడతల రాకేశ్, శ్రీకాంత్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## మూతబడ్డ పాఠశాలలు తెరిపించేందుకు కృషి



ప్రచార జాత ప్రారంభిస్తున్న అధ్యక్షురాలు శాంతికుమారి

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 1 : జిల్లాలో మూతబడిన పాఠశాలను తెరిపించేదుకు తమ వంతు కృషి చేస్తామని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి అన్నారు. సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రచార జాత కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. జిల్లాలో మూతబడిన పాఠశాలలు 36 వరకు ఉన్నాయని, తెరిపించేందుకు డీఈవోతో మాట్లాడి తమవంతు కృషి చేస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి, నాణ్యమైన ప్రభుత్వ ఉచిత విద్య సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మధూకర్, ఎంఈవో సుభాష్, ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల నాయకులు దినకర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

కాసిపేట, జూన్ 1 : కాసిపేట మండలం ముత్యంపల్లి గ్రామానికి చెందిన తీగల శ్రీనివాస్ రావు-సుజాత దంపతుల కొడుకు ఆశ్రిత్.. జేఈఈలో ర్యాంక్ సాధించి, సెంట్రల్ యూనివర్సిటీలో ప్రవేశం పొందాడు. కాగా, బెల్లంపల్లి క్యాంప్ కార్యాలయంలో ఆదివారం విద్యార్థిని ఎమ్మెల్యే వినోద్ సన్మానించి, ల్యాప్‌టాప్ అందించారు. బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, మండలాధ్యక్షుడు రత్నం ప్రదీప్, ప్రధాన కార్యదర్శి మైదం రమేశ్, నాయకులు మెరుగు శ్రీనివాస్, విద్యార్థి తండ్రి తీగల శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇండ్లు

దండేపల్లి, జూన్ 1 : అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నారు. దండేపల్లి మండలం మేదరిపేటలో ఆదివారం లబ్ధిదారులకు మంజూరు పత్రాలు, రాజీవ్ యువ వికాస పత్రాలు అందజేశారు. నిబంధనల ప్రకారం ఇండ్లు నిర్మించుకున్న వారికి సకాలంలో డబ్బు బ్యాంకు ఖాతాలో వేస్తామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేంచంద్, తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, ఎంపీడీవో ప్రసాద్, మాజీ ఎంపీపీలు గడ్డం శ్రీనివాస్, జాబు కాంతారావు, జిల్లా నాయకులు గడ్డం త్రిమూర్తి, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు అక్కల వెంకటేశ్వర్లు, కంది సతీశ్‌కుమార్, నాయకులు ఉన్నారు.

## లెదర్ ఇండస్ట్రియల్ పార్క్ జేఏసీల ఏర్పాటు



జేఏసీ కన్వీనర్లతో సంఘం నాయకులు

మందమర్రి, జూన్ 1: మందమర్రి పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో లెదర్ పార్క్ సాధన చర్మకార ఉత్పత్తి దారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఇండస్ట్రియల్ పార్క్ మంచిర్యాల జిల్లా, మందమర్రి పట్టణ జేఏసీలను ఏర్పాటు చేశారు. పట్టణ జేఏసీ కన్వీనర్‌గా నెరువట్ల శ్రీనివాస్, కో కన్వీనర్లుగా మంతెన సుమన్, ముల్కల రమేశ్, కే రామకృష్ణ, నందిపేట రాజు, నెరువట్ల సుజిత్, గడ్డం అనిల్, కొలుగూరి పృథ్వీరాజ్, బత్తుల సరిత, బొడ్డు వినోద, సకినాల సాయికృష్ణ, ఎంవీ గుణ, కాసిపేట స్వామి, తోకల నిరోష, గౌరవాధ్యక్షుడిగా ఉప్పులేటి నరేశ్, జిల్లా గౌరవాధ్యక్షుడిగా పుల్లూరి లక్ష్మణ్, జిల్లా కన్వీనర్‌గా చిప్పకుర్తి ఐలయ్య, జంగంపల్లి రామస్వామి, పల్లె సమ్మయ్య, నందిపేట రవి, దరిపెల్లి కనకయ్య, సిర్ర దివాకర్, నేరెళ్ల శంకరయ్య, ఎలుకలపెల్లి మల్లేశ్, సుద్దాల జనార్దన్, ఆసంపల్లి రాయమల్లు, బచ్చలి నర్సయ్య, వేల్పుల కిరణ్, చిలుముల కుమార్, మామిడిపల్లి ప్రకాశ్, కొంకటి శ్రీనివాస్ ఎంపికయ్యారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కొలుగూరి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఉత్తమ ఎంఈవోకు సన్మానం



ఎంఈవో సుభాష్‌ను సన్మానిస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 1 : మల్టీజోన్-1లో ఉత్తమ ఎంఈవోగా ఎంపికైన రాథోడ్ సుభాష్‌ను ఆదివారం టీఎస్ యూటీఎఫ్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వృత్తిపై అంకితభావంతో పనిచేస్తే ఎప్పుడైనా గుర్తింపు లభిస్తుందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శాంతి కుమారి, ఊషన్న, హేమంత్ షిండే, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## మునీర్ మృతిపై సంతాపం



మునీర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కాసిపేట, మే 1 : కాసిపేట మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ భవనంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్ట్ మునీర్ మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రౌత్ సత్తయ్య, ప్రజా సంఘాల నాయకులు హెచ్ రవీందర్, సిలోజ్ మురళి, చిన్న భీమయ్య, రాజన్న, నాయకులు సిరాజ్ ఖాన్, రాంటెంకి వాస్‌దేవ్, జర్నలిస్టులు లింగస్వామి, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

## సులభ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మందమర్రి, జూన్ 1 : సింగరేణి ప్రాంతంలో కార్మిక కుటుంబ సభ్యుల సౌకర్యార్థం నిర్మించిన సులభ్ కాంప్లెక్స్‌లలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు ఎండీ జాఫర్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సామూహిక మరుగుదొడ్లను నిర్వహిస్తున్న సులభ్ ఇంటర్‌నేషనల్ సంస్థ కార్మికులకు సరైన వైద్య సౌకర్యం కల్పించకుండా, సీఎంపీఎఫ్ అమలు చేయకుండా, సరైన సమయంలో వేతనాలను చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నదని పేర్కొనారు. సులభ్ కాంప్లెక్స్‌ల వద్దనే ఉండి కార్మికులకు సూచిస్తున్న అధికారులు సులభ్ కాంప్లెక్స్‌లను మాత్రం మరమ్మతులు చేయడం లేదని, అధికారులు కనీసం పర్యవేక్షించడం లేదని వాపోయారు. సంబంధిత సూపర్‌వైజర్ కార్మికులను బెదిరింపులకు గురిచేయడంతో పాటు, బయట పనులు చేయిస్తున్నాడని, కార్మికుల వద్ద డబ్బు తీసుకుంటున్నాడని ఆరోపించారు. విషయం బయట చెబితే ఉద్యోగాల నుంచి తొలగిస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నాడని మండిపడ్డారు.

## సహకరించిన వారికి కృతజ్ఞతలు

రెబ్బెన, జూన్ 1 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలిగా ఎన్నుకొని సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మారిన శృతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో బాల్ బ్యాడ్మింటన్ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు. సహకరించిన చీఫ్ ప్యాట్రన్ నారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎస్ తిరుపతి, మారిన వెంకటేశ్వర్లు, భాస్కర్, శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్ర అవతరణ వేడుకలను విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 1 : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నేడు నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అవతరణ వేడుకలకు శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ హాజరవుతారని, ఉదయం 9.45 గంటలకు అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛం సమర్పణ, 10 గంటలకు జాతీయ పతాకావిష్కరణ, 10:05 గంటలకు పోలీసు గౌరవ వందనం స్వీకరణ ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం జిల్లా ప్రగతిపై ప్రసంగిస్తారని, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

### వేడుకలకు ఏర్పాట్లు ..

రెబ్బెన, జూన్ 1 : రెబ్బెన మండలంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ పార్టీల జెండాలను ముస్తాబు చేశారు. గోలేటిటౌన్‌షిప్‌లోని భీమన్న క్రీడామైదానంతో పాటు, గోలేటి జీఎం కార్యాలయాన్ని సింగరేణి యాజమాన్యం సర్వంగా సుందరంగా ముస్తాబు చేసింది. క్రీడామైదానంలో జరిగే వేడుకల్లో ఉత్తమ ఉద్యోగులను సన్మానించనున్నట్లు అధికారులు తెలిపారు.

## రెండో వార్షిక ఇంక్రిమెంట్ ఇవ్వాలి



రీజినల్ డైరెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న అధ్యాపకులు

నస్పూర్, జూన్ 1 : రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న నూతన అధ్యాపకులకు రెండో వార్షిక ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని కోరుతూ ఆదివారం ఇంటర్ విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ జయప్రదబాయ్‌కి అధ్యాపకులు వినతి పత్రం అందించారు. 20 ఏళ్లకు పైగా పనిచేస్తున్న జూనియర్ కాంట్రాక్టు లెక్చరర్లను ప్రభుత్వం క్రమబద్ధీకరించిందన్నారు. సుమారు 3,200 మంది రెగ్యులర్‌గా విధులు నిర్వహిస్తూ మొదటి వార్షిక ఇంక్రిమెంట్ కూడా తీసుకున్నారని, రెండో సంవత్సరం ఇంక్రిమెంట్ రాలేదని తెలిపారు. ఎలాంటి డిసిప్లినరీ కేసులు లేకుండా ప్రొహిబిషన్ పీరియడ్ పూర్తి చేసిన వారికి రెండో వార్షిక ఇంక్రిమెంట్ జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు షఫీయుద్దీన్, సందీప్‌కుమార్, జ్యోతిలక్ష్మి, సునీత, శైలజ, సతీశ్, ప్రసాద్, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాధిత రైతులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న అఖిల పక్షం నాయకులు

రెబ్బెన, జూన్ 1 : బెల్లంపల్లి ఏరియా గోలేటి ఓపెన్‌కాస్ట్ కోసం భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని అఖిలపక్షం నాయకులు కేసరి అంజనేయులుగౌడ్, కేసరి కిషన్‌గౌడ్, కడతల మల్లయ్య, తోట లక్ష్మణ్, బోగె ఉపేందర్, సోల్లు లక్ష్మి, బండారి తిరుపతి డిమాండ్ చేశారు. గోలేటి వారసంతలో ఆదివారం అఖిలపక్షం సమావేశం ఏర్పాటు చేసుకొని మాట్లాడారు. ఎకరానికి రూ.70 లక్షలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమ్రం దొందేరావ్, అరిగెల మధూకర్‌గౌడ్, ధర్మ పటేల్, లచ్చుపటేల్, రాయిళ్ల నర్సయ్య, నవీన్ గౌడ్, మద్దెల సురేందర్‌రాజు, కోరాళ్ల రాజేందర్, సంగెం శంకర్, శేఖర్, రమేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు

## అభ్యుదయ రైతులకు విత్తనాలు పంపిణీ

బెల్లంపల్లి, జూన్ 1 : పంటల సాగులో నాణ్యమైన విత్తనం పాత్రను గుర్తించి 'నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తం' వినూత్న కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ కోట హరికృష్ణ తెలిపారు. ఇందులో భాగంగా ఎంపిక చేసిన ముగ్గురి నుంచి ఐదుగురు అభ్యుదయ రైతులకు వ్యవసాయ పరిశోధనా స్థానాల నుంచి ఉత్పత్తి చేసిన నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులకు విత్తనోత్పత్తిపై ఎప్పటికప్పుడు వ్యవసాయ శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు ఇస్తారని వెల్లడించారు. నాణ్యమైన విత్తనాన్ని సాగు చేసి, ఉత్పత్తి అయిన విత్తనాన్ని తోటి రైతులకు తక్కువ ధరలకు అందజేయాలని తెలిపారు. రానున్న రెండు, మూడేండ్లలో ప్రతీ గ్రామాన విత్తన స్వయం సమృద్ధి సాధించమే కాకుండా, రాష్ట్రం విత్తన భద్రతలో దేశంలోనే మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలన్నదే కార్యక్రమం ఆశయమని వివరించారు.

## డీఏలు విడుదల చేయాలి

కాగజనగర్, జూన్ 1 : ఉద్యోగులు, పింఛన్‌దారులకు పెండింగ్ డీఏ బకాయిలు వెంటనే విడుదల చేయాలని విశ్రాంత ఉద్యోగ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. 5 డీఏలు పెండింగ్‌లో పెట్టి ప్రభుత్వం తమను ఇబ్బందులు పెదుడున్నాన్నదని ఆరోపించారు. రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ ఆదివారం ప్రభుత్వానికి ఫ్యాక్స్ ద్వారా వినతిపత్రం పంపించారు. డీఏ పెండింగ్‌లో ఉన్నందున ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు.







